క్లుప్తంగా

కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులను అందిస్తున్న సర్పంచ్ రంగనాథ్

మడకశిరరూరల్: మెళవాయి పంచాయతీలో కార్మికులకు విజయదశమి సందర్భంగా గురువారం సర్పంచ్ రంగనాథ్ దుస్తులను పంపిణీ చేశారు. ఏటా విజయదశ పండుగకు కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో వీధులు, రోడ్లపై చెత్త కుప్పలు లేకుండా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి జయరంగమ్మ, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు బాధితులకు వస్త్రాల పంపిణీ

పావగడ: మహాత్మ గాంధీజీ 155 వ జయంతి సందర్భంగా స్థానిక స్వామి వివేకానంద సంఘటిత గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో కుష్టు రోగులకు వస్త్రాలు, చీరలు, పంచెలు, టవాళ్లు, నిత్యావసర కిట్లను న్యాయమూర్తి మాదేశ్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ గాంధీజీ ఆశయాల మేరకు కుష్టు రోగుల సేవలు నిరంతరం అందిస్తున్నామన్నారు. దసరా పండుగ సందర్భంగా వందలాది మంది కుష్టు రోగులకు దుస్తుల తో పాటు వారికి అవసరమైన ఔషధాలు, పాదరక్షలు,వాకర్లు, వాకింగ్ స్టిక్ లు అందించామన్నారు. సివిల్ న్యాయమూర్తి మాదేశ్ మాట్లాడుతూ స్వామి జపానంద సేవలు అభినందనీయమని కొనియాడారు.

అలరించిన కవి గోష్టి



కవిత చదువుతున్న చన్నబసవణ్ణ

పావగడ: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కవి గోష్టి సాహిత్య ప్రియులను అలరించింది. స్థానిక విద్యా సంపన్మూల కేంద్రంలో తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కవి గోష్టిలో కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి మాట్లాడారు. సమస్యలను ప్రతి బింబించి పరిష్కారాలను కనుకొనేలా కవితలు రాయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవులు బ్యాడనూరు చన్నబసవణ్ణ, పురుషోత్తమ, చన్నకేశవ నాయక్, మంజమ్మ సుధీంద్ర, కృష్ణకుమార్, అంబుజ రామనాథన్, మూర్కణ్ణప్ప, దవసం గోపాల కృష్ణ తదితరులు కవితలు శ్రావ్యంగా చదివారు. హోమా నాగరాజ్, ఐఏ నారాయణప్ప రోటరి రామనాథ్, ఉపాధ్యాయురాలు జయశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవి గోష్టి లో పాల్గొన్న కవులందరికి పుస్తకాలు బహుమానంగా అందించారు.

అంతర్జాతీయ సదస్సులో హెచ్‌ఎం

రొళ్ల: ఇంపాక్ట్ సంస్థ గురువారం నిర్వహించిన అంతర్జాతీయ జూమ్ సదస్సులో రత్నగిరి ఆదర్శ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కే.హరిప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన 28 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలోని అనుభవాలను తెలియజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లేపాక్షి ఎంపీడీఓగా నరసింహ మూర్తి

లేపాక్షి: లేపాక్షి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎస్.నరసింహమూర్తి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గుమ్మఘట్ట మండలం నుంచి బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీఓకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

6న తుమకూరు కలెక్టర్ రాక

మడకశిరరూరల్: నీలకంఠాపురం గ్రామానికి ఈనెల 6న కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ పర్సనల్ డిపార్ట్‌మెంట్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ సత్యవతి, తుమకూరు జిల్లా కలెక్టర్ శుభకల్యాణ్ రానున్నారు. ఈమేరకు సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్వాతంత్య్ర సమరయోధుడు, మాజీ ఎంపీ శ్రీరామరెడ్డి జయంతి సందర్భంగా జరిగే క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేస్తారని తెలిపారు.

చిలమత్తూరు తహసీల్దార్‌గా సౌజన్యలక్ష్మి

చిలమత్తూరు: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా సౌజన్యలక్ష్మి నియమితులయ్యారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్‌గా పని చేసిన ఆనంద్ కుమార్‌కు పదోన్నతిపై పెనుగొండ ఆర్డీఓగా నియమితులయ్యారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

వివాదం ముగిసేనా..

వైద్యం అందేనా?

- హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ మార్పు
- డాక్టర్ లింగన్నకు మరోసారి బాధ్యతలు



హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రి

హిందూపురం టౌన్: హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ వ్యవహారం వైద్యులు, సిబ్బంది వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వైద్యుల మధ్య కోల్డ్‌వార్‌కు అధికారులు చెక్ పెట్టారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ రోహిల్ కుమార్‌ను మార్చారు. వైద్యవిధాన పరిషత్ ఉన్నతాధికారులు నూతన సూపరింటెండెంట్‌ను నియమించారు. ఆసుపత్రిలో వైద్యుల మధ్య నెలకొన్న సమస్య సద్దుమణిగినట్టేనా అంటూ ఆసుపత్రి వర్గాల్లో చర్చ సాగుతోంది.

సీనియార్టీ ప్రకారం సూపరింటెండెంట్ నియామకం..

ప్రభుత్వం ఆస్పత్రిలో మొత్తం 45 మంది వైద్యులు ఉండగా.. ఇందులో పలువురు సీనియర్ వైద్యులు ఉన్నారు. వీరందరినీ కాదని జూనియర్ డాక్టర్ అయిన రోహిల్ కుమార్‌ను సూపరింటెండెంట్‌గా నియమించారు. ఇది పలువురు వైద్యులకు నచ్చలేదు. రోహిల్ కుమార్ సూపరింటెండెంట్‌గా ఉన్న సమయంలో సీనియర్ వైద్యులను వేధింపులకు గురి చేయడం, ఇష్టానుసారంగా వ్యవహరించడం, వైద్యుల రోస్టర్‌లోనూ ఇబ్బందులు గురి చేశారని పలువురు సీనియర్ వైద్యులు వైద్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. దీంతో పాటు ఒక అడుగు ముందుకు వేసిన పలువురు సీనియర్ వైద్యులు సూపరింటెండెంట్‌గా ఉన్న రోహిల్‌ను మార్చాలని ఏకంగా డైరెక్టరేట్ ఆఫ్ సెకెండరీ హెల్త్ కమిషనర్‌కు లేఖ రాశారు. అలాగే డిప్యూటీ సీఎం, ఆరోగ్య శాఖ మంత్రి, వైద్యశాఖ ఉన్నతాధికారులకు కూడా లేఖలు వెళ్లాయి. లేఖలో 'డాక్టర్ రోహిల్.. ఆస్పత్రిలోని సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లలో జూనియర్ అని.. అతడికి ఎలాంటి పరిపాలన అనుభవం లేదు. క్లినికల్ డాక్టర్ కాదు. వైద్యులతో సరిగా సత్సంబంధాలు కొనసాగించడం లేదు. వీటిని పరిగణనలోకి తీసుకుని మెడికల్ సూపరింటెండెంట్‌గా సీనియర్ సివిల్ సర్జన్‌తో భర్తీ చేయాలి' అని పేర్కొన్నారు. లేఖపై ఎన్నో తర్జనభర్జనలు, నివేదికల అనంతరం ఎట్టకేలకు సూపరింటెండెంట్‌గా డాక్టర్ రోహిల్‌ను తప్పించారు. ఆస్పత్రిలో సీనియర్ సివిల్ సర్జన్ అయిన డాక్టర్ లింగన్నను సూపరింటెండెంట్‌గా నియమిస్తూ వైద్యశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులను జారీ చేశారు.

మూడు నెలలకోసారి సూపరింటెండెంట్ మార్పు?

హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సూపరింటెండెంట్లను మార్చడం చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక డాక్టర్ లింగన్నను తప్పించారు. ఈ నేపథ్యంలో 2024 జూలై 1న జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రోహిల్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. అయితే గతంలోనూ ఈయన సూపరింటెండెంట్‌గా పని చేశారు. 2022 డిసెంబర్ నుంచి 2024 మార్చి వరకు సూపరింటెండెంట్‌గా ఉన్నారు. ఈయన స్థానంలో 2024 మార్చి 23వ తేదీ నుంచి డాక్టర్ లింగన్నకు బాధ్యతలు అప్పగించారు. ఈయన్ను మూడు నెలల పాటు కొనసాగించి.. 2024 జూలైలో తొలగించారు. అనంతరం డాక్టర్ రోహిల్‌కు బాధ్యతలు ఇచ్చారు. మళ్లీ రోహిల్‌ను తొలగించి మూడు నెలల తర్వాత ప్రస్తుతం డాక్టర్ లింగన్నకు మరోసారి బాధ్యతలు అప్పగించారు. ఇలా మూడు నెలలకోసారి సూపరింటెండెంట్ మారుతుండటంతో వైద్యులు, సిబ్బందికి, ఆస్పత్రి పరిపాలనాపరంగానూ ఇబ్బందిగా మారింది.

అందరూ సహకరిస్తారా?

హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో దాదాపు 45 మంది వైద్యులు ఉన్నారు. వీరిలో కొందరూ పాత సూపరింటెండెంట్‌కు మద్దతుగా నిలవగా.. కొందరూ వ్యతిరేకించారు. ఇందులో భాగంగా నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ లింగన్న బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో కొంత మంది సహకరిస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైద్యులు సమన్వయంతో ఉంటే ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందగలవు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి వైద్యులందరితో సమావేశం నిర్వహించి, సమన్వయం కుదర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మడకశిర ఎక్సైజ్ సీఐగా ప్రసాద్ రావు



మడకశిర: మడకశిర ఎక్సైజ్ సీఐగా ప్రసాద్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎక్సైజ్ సీఐ ధీరజ్‌రెడ్డి మైదుకూరుకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో నూతన సీఐగా ప్రసాద్‌రావును నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు నియోజకవర్గమైన మడకశిర ప్రాంతంలో అక్రమ మద్యాన్ని నివారించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదిలా ఉండగా ఎక్సైజ్ ఎస్‌ఐగా శంకర్ బాధ్యతలు స్వీకరించారు.

విద్యుత్ స్తంభం మార్చిన ట్రాన్స్‌కో అధికారులు



కొత్త స్తంభం ఏర్పాటు చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

రొద్దం: మండల కేంద్రంలోని కలిపి – హిందూపురం ప్రధాన రహదారి పక్కన ఫ్లోర్‌మిల్ వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం స్థానంలో మరో స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని మార్చారు.

ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయొద్దు



సోమందేపల్లి: ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

గోరంట్ల: విశాఖ ఉక్కు కార్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయకుండా ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, కేపీపీఎస్ సంఘాల నాయకులు తహసీల్దార్ మారుతీకి గురువారం వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ఎంతో మంది ప్రాణత్యాగాలు, పోరాటాల ఫలితంగా ఏర్పడిందన్నారు. ఉక్కు కర్మాగారం ద్వారా రాష్ట్రంలోని వేలాది మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి పొందుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయడానికి ఉపక్రమిస్తోందన్నారు. ఈ మేరకు తహసీల్దార్ మారుతీకి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నార్శింపల్లి ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత, భవన నిర్మాణ సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండ వెంకటేశులు, వీఆర్‌పీఎస్ మండల నాయకులు ముత్యాలప్ప పాల్గొన్నారు.

సోమందేపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయకుండా ఆపాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డిశేఖర్‌కు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న గురువారం వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రైవేటీకరణ జరగకుండా అడ్డుకుంటామని హామీ ఇచ్చి విస్మరించారని తెలిపారు. ఎంతో మంది కార్మికులు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కిష్టప్ప, రామకృష్ణ పాల్గొన్నారు.

పనులు గుర్తించడానికే గ్రామసభలు



అమరాపురం: తమ్మడేపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఈఓఆర్డీ నాగముని

అమరాపురం: మండలంలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పనులు గుర్తించడానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్, ఈఓఆర్డీ నాగముని పేర్కొన్నారు. గురువారం మండలంలోని పంచాయతీల్లో గురువారం సర్పంచుల అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాబోవు ఆర్థిక సంవత్సరానికి ఆయా గ్రామాల్లో ఏఏ పనులు చేపట్టనున్నారో తెలియజేశారు. తమ్మడేపల్లి పంచాయతీలో సీసీ రోడ్లు నిర్మాణం చేయాలని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా టీపీ. విశాల్ మాట్లాడుతూ రైతులు, కూలీలు, గ్రామ ప్రజలు ఇచ్చిన వాటిని పరిశీలించి అనంతరం ప్రణాళిక రూపొందించి ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ఎంపీటీసీలు, అధికారులు, సచివాలయం సిబ్బంది కూలీలు, రైతులు పాల్గొన్నారు.

అగళి: మండల పరిధిలోని 13 పంచాయతీలోని సచివాలయ ఆవరణలో గురువారం సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధి హామీ కింద ఏఏ పనులు చేపట్టాలో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదవేంద్ర, ఈఓఆర్డీ పద్మ, ఏపీఓ శివన్న, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొనారు.

రొళ్ల: ఉపాధి హామీ కింద వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనుల గుర్తింపు కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ ఓబుళప్ప తెలిపారు. గురువారం హొట్టేబెట్ట, ఎం.రాయాపురం , దొడ్డేరి, కాకి, హులికుంటలో ఆయా పంచాయతీల సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. హొట్టేబెట్టలో జరిగిన గ్రామసభలో ఏపీఓ ఓబుళప్ప మాట్లాడుతూ ప్రతి కూలీకి ఉన్న ఊళ్లలోనే వంద రోజుల పని కల్పిస్తామన్నారు. ఐదెకరాలోపు భూములు కలిగిన సన్న, చిన్నకారు రైతుల పొలాల్లో పండ్ల మొక్కల పెంపకానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని తెలిపారు. మండల పరిషత్ ఏఓ ప్రసాద్, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

దసరా ప్రశాంతంగా జరుపుకుందాం

హిందూపురం అర్బన్: దసరా పండుగను ప్రశాంతంగా జరుపుకుందామని డీఎస్పీ మహేష్ ప్రజలకు సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొందరు అమ్మవారి విగ్రహాల ఏర్పాటుకు ముందుకొచ్చినా.. విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వలేదన్నారు. గతంలో ఎలా ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నారో ఇప్పుడు కూడా అదే విధంగా జరుపుకోవాలన్నారు. పండుగ ముగిసే వరకు డీజేలు, డ్యాన్సులు, బాణసంచా, ఊరేగింపులు నిషేధమని వెల్లడించారు. డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు.

సీతారామస్వామి ఆలయానికి విరాళం



సీతారామస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న దృశ్యం

గోరంట్ల: మండలంలోని మందలపల్లి లో రూ.1.2 కోట్లతో దేవదాయశాఖ, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సీతారామస్వామి ఆలయ నిర్మాణానికి మేరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వనం రాజశేఖరరెడ్డి గురువారం రూ.1,00,116 విరాళంగా అందించారు. ఆలయ కమిటీ, గ్రామస్తులు మునలిరెడ్డి, మధుసూదనరావు, ఇందిలినారాయణరెడ్డి తదితరులకు అందించారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



అమరాపురంలో ప్రత్యేక అలంకరణలో చోళమాంబదేవి



హిందూపురంలో భువనేశ్వరీగా వాసవీమాత



సోమందేపల్లి: చౌడేశ్వరిదేవి ఆలయంలో పూజలు



బాలా త్రిపుర సుందరిగా దర్శనమిస్తున్న చౌడేశ్వరీ దేవి



రొళ్ల మండలం జీరిగేపల్లి అమ్మాజీ దేవతలను ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం



పావగడ: పసుపు కుంకుమ అలంకారంలో అమ్మవారు

అమరాపురం: మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా గురువారం ప్రారంభమయ్యాయి. హేమావతి సిద్దేశ్వరాలయం, తమ్మడేపల్లి ఆంజనేయస్వామి ఆలయం, అమరాపురం కోట వీధిలో వెలసిన గ్రామ దేవత చోళమాంబదేవి ఆలయంలో శ్రీదేవి అమ్మవారు, కన్యాకాపరమేశ్వరి, లక్ష్మీవెంకటేశ్వరస్వామి, జైన ఆలయంలో పద్మావతి అమ్మవారు భక్తులకు ప్రత్యేక రూపంలో దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రొళ్ల: రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి, జీరిగేపల్లి అమ్మాజీ ఆలయాల్లో గురువారం శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. ఉదయాన్నే అమ్మవారి మూల విగ్రహాలను శుద్ధి చేసి భక్తులు కానుక రూపంలో తీసుకొచ్చిన పట్టవస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో అలంకరణ చేసి మహామంగళారతి ఇచ్చారు. అమ్మవార్లను దర్శించుకోవడం కోసం భక్తులు పోటెత్తారు.

అగళి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో మధూడి గ్రామంలో వెలసిన వీరభద్రస్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగళి కన్యకా పరమేశ్వరి అమ్మవారు, కోమరేపల్లిలో గురు భీరలింగేశ్వర స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు.

పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో శరన్నవరాత్రుల పూజలు గురువారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా దుర్గా దేవి పసుపు కుంకుమ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సోమందేపల్లి: కేంద్రమైన సోమందేపల్లిలోని ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చౌడేశ్వరి దేవి, కన్యకాపరమేశ్వరి, మరిగమ్మ, పెద్దమ్మ ఆలయాల్లో ప్రత్యేక అలంకరించారు. భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.



అమరాపురంలో కొలువుదీరిన దుర్గామాత

హిందూపురం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గురువారం పట్టణంలో పేట వెంకట రమణస్వామి ఆలయంతోపాటు వివిధ అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు, అలంకరణలు, పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

బాలా త్రిపుర సుందరిగా చౌడేశ్వరీ దేవి

చిలమత్తూరు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని దేమకేతేపల్లి వద్ద వెలసిన చౌడేశ్వరీదేవి గురువారం బాలా త్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. మేరకు అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు.

రొద్దంలో భారీ వర్షం



రామనపల్లి వద్ద వంక పారుతున్న దృశ్యం

రొద్దం: మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారు జాము వరకూ భారీ వర్షం కురిసింది. చెరువుల్లోకి నీరు చేరిందని గ్రామస్తులు తెలిపారు. వర్షపునీటి ఉధృతితో చెక్ డ్యాంలు, కుంటలు, వంకలు, వాగులు పొంగి పొర్లాయి. మండల కేంద్రంలోని హౌసింగ్ కాలనీలో వర్షపు నీరు ఇళ్లవద్దకు భారీగా చేరాయి.

అగళిలో..

అగళి: మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు మోస్తరు వర్షం కురిసింది. దీంతో పలు చెరువులు, కుంటల్లోకి నీళ్లు చేరాయి.

మడకశిరలో 34 ఎంఎం వర్షపాతం

మడకశిరరూరల్: మడకశిర మండలంలో బుధవారం రాత్రి 34 ఎంఎం, అగళి 23.4 ఎంఎం, రొళ్ల 12.2 ఎంఎం, గుడిబండ 6 ఎంఎం వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు. వేరుశనగ పంట పిందె దశలో వర్షం రాకపోవడంతో పంట ఎండిపోతుండడంతో కాయలు లేకపోయిన పశుగ్రాసం కోసం పంటను తొలగించారు. మూడు రోజుల నుంచి మోస్తరు వర్షం పడుతుండడంతో తొలగించిన వేరుశనగ పంట పొలంలోనే తడిసి పోతుండడంతో పశుగ్రాసం దక్కేలా లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



గుడిబండ: వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ వీరనరేష్

అమరాపురం: రైతులు పంటల సాగుకు ముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ మంజునాథ సూచించారు. గురువారం కె.శివరం, నిద్రగట్ట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతుల పొలాలను పరిశీలించి పంటల సాగుపై పలు సూచనలు చేశారు.

గుడిబండ: జంబులబండ, కొంకల్లు గ్రామంలో గురువారం ఏఓ వీరనరేష్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ కంది, వేరుశనగ, రాగి పంట పొలాలను పరిశీలించి పలు సూచనలు, సలహాలను రైతులకు తెలియజేశారు. సర్పంచ్ కవిత ఓబన్న, రైతు సేవా అధికారులు పాల్గొన్నారు.

వెంకటరెడ్డి సేవలు అమోఘం



మాట్లాడుతున్న ఏటిగడ్డ అశ్వర్థ నారాయణ

హిందూపురం: శ్రీసత్యసాయి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని తపన సాహితి వేదిక కార్యాలయంలో గురువారం వైసీపీ వెంకటరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నల్లమాడ మండలానికి చెందిన యనమల చిన్నయ్య వెంకటరెడ్డిగా (వైసీపీ వెంకట రెడ్డి) సాహితీ లోకానికి సుపరిచితుడన్నారు. ఆయన సెప్టెంబర్ 30వ తేదీన మృతి చెందడం బాధాకరమన్నారు. తెలుగు భాషలో వందల సంఖ్యలో పుస్తకాలను హిందీ భాషలోకి అనువదించి ఎంతో పేరు ప్రఖ్యాతలు గడించారని కొనియాడారు. వెంకటరెడ్డి మృతి సాహితీ లోకానికి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో అరసం జిల్లా గౌరవాధ్యక్షుడు, తపన సాహితీ వేదిక వ్యవస్థాపకుడు సడ్లపల్లె చిదంబర రెడ్డి, కల్లూరు రాఘవేంద్రరావు, అరసం జిల్లా అధ్యక్షుడు సిద్ధగిరి శ్రీనివాస్, గౌరవ సలహాదారు శాంతి జయప్రకాష్, కార్యదర్శి గంగాధర్, వెంకటరమణ, షహీన, గంగాధర్, కాలవ మురళీమోహన్ అరసం సభ్యులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

బత్తలపల్లి: స్థానిక బైపాస్ రోడ్డులో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. గురువారం తెల్లవారుజామున ధర్మవరం నుంచి అనంతపురానికి బాయిలర్ కోళ్లను తీసుకువెలుతున్న లగేజీ వ్యాను ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే ప్రయత్నంలో డివైడర్‌ను ఢీ కొంది. ప్రమాదంలో డ్రైవర్ చాంద్‌బాషా, క్లీనర్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. వ్యానులో ఉన్న బాయిలర్ కోళ్లు దాదాపు 50 వరకు మృతి చెందాయి. పెద్దపప్పూరు మండలం సోమనపల్లికి చెందిన రామాంజనేయులు తన కుమార్తెను పిలుచువెళ్లాలని కారులో అనంతపురం మండలం మన్నీల గ్రామానికి వెలుతుండగా, అనంతపురం నుంచి బత్తలపల్లి వైపు వస్తున్న లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో రామాంజనేయులుతో పాటు కారు డ్రైవర్ అరుణ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సహకారంతో పోలీసులు వారిని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ఘటనలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.